క్లుప్తంగా

హ్యాపీ న్యూ ఇయర్ సార్..



కలెక్టర్ వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డికి సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక నేతలతో కలసి ఆయన కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉత్తమ డాక్టర్‌గా సురేంద్ర బాబు



జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ సురేంద్రబాబు

కలువాయి: కలువాయి మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సురేంద్రబాబు ఉత్తమ డాక్టర్‌గా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా సోమవారం అవార్డు అందుకున్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో ఆయన పనితీరుకు గుర్తింపుగా ఈఅవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత

రాపూరు: మండలంలోని పంగిలి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ కూకాటి లక్ష్మీదేవమ్మ సోమవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలన్న లక్ష్యంతో ట్యాబ్‌లను అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట యాదవ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా 12 పేజీలతో ఎంతో ఆకర్షణీయంగా తయారు చేసిన క్యాలెండర్‌ను సంఘం గౌరవాధ్యక్షుడు జెట్టి వేణుయాదవ్, సంఘం అధ్యక్షుడు మెల్లకంటి శ్రీనివాసులు యాదవ్, కార్యదర్శి ముచ్చకాల హర్షవర్ధన్ యాదవ్, కోశాధికారి గురకల వజ్రమణి యాదవ్, ఉపాధ్యక్షుడు వెంపళ్ల హరికృష్ణ యాదవ్, నట్టేటి శివయ్యయాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రజాప్రతినిధులు



శ్రీవారి ఆలయం వెలుపల ఎమ్మెల్సీ కల్యాణ్, అరకు ఎమ్మెల్యే ఫల్గుణ కుటుంబ సభ్యులు

గూడూరు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఆయన సతీమణి టీటీడీ మెడికల్ అడ్వైజర్ డాక్టర్ శ్వేతలు, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ కుటుంబ సభ్యులతో కలసి సోమవారం వేకువన శ్రీవారిని దర్శించుకున్నారు. వారి వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరామిరెడ్డి, రమేష్ యాదవ్ తదితరులున్నారు.

యూరియా పంపిణీ

సైదాపురం: మండలంలోని రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో యూరియాను అందజేస్తున్నట్లు ఏఓ హైమావతి తెలిపారు. మండల కేంద్రం సైదాపురం రైతు భరోసా కేంద్రంలో సోమవారం పలువురు రైతులకు యూరియా అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లోనే ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను సమర్పించి తీసుకోవచ్చన్నారు.

వైభవంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



కోట బీసీ గురుకుల పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

కోట: కోట బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ పండగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. భోగిమంటలు వేశారు. హరిదాసుల వేషధారణ, కోలాటాలు, ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులంతా సంప్రదాయ దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నారాయణరావు మాట్లాడుతూ మన సంస్కృతిలో పండుగలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

మహద్భాగ్యం.. వైకుంఠ ద్వార దర్శనం

- భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. శ్రీపెనుశిల నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 3 గంటలకు స్వామివారికి అభిషేకం, 4 గంటలకు పూలంగిసేవ, 5 గంటలకు ఉత్తరద్వార దర్శనం, విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి నిత్యకల్యాణ మండపంలో 7 ఉత్తర ద్వారాలు ఏర్పాటు చేసి అందులో బంగారు గరుడ వాహనంపై పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఈక్షేత్రం ఉత్తర ముఖంగా ఉన్న నిత్యకల్యాణ మండపంలో 7 బంగారు కాంతులతో ఉట్టిపడేలా ద్వారాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ స్వామివారిని దర్శిస్తే సాక్షాత్తు వైకుంఠంలోని స్వామివారిని దర్శించినట్లుగా భావన కలిగే విధంగా అలంకరించారు. ఉదయం 10.30 గంటలకు స్వామి, అమ్మవార్ల అలంకార మండపంలో నిర్వహించారు. అలాగే స్వామివారి బంగారు గరుడవాహనం పక్కనే గోదాదేవిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు, ఆస్థాన సేవ జరిపించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చెన్నుతిరుపాల్ రెడ్డి, ఏసీ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, భక్తులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై నారసింహుడు..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామివారికి అత్యంత ప్రీతికరమైన స్వర్ణ గరుడ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పెంచలకోన మాడవీధుల్లో విహరించారు. స్వామివారి ఊరేగింపును తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాపూరులో..



బంగారు గరుడవాహనంపై లక్ష్మీనరసింహుడు

రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న శ్రీమహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల్లో మహావిష్ణువు, శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై ఉత్తర దిక్కున ఉంచి వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాధాసమేత గోపాలకృష్ణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజలు చేపట్టి, అన్నదానం చేపట్టినట్లు చైర్మన్ శశిధర్‌రెడ్డి తెలిపారు.

వెంకటగిరిలో

వెంకటగిరి: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, వరదరాజస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

గూడూరులో..

గూడూరు: పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, పాండురంగస్వామి, అలఘునాథస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారదర్శనంలో దర్శించుకున్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న అభయ అనుగ్రహ వేంకటేశ్వర స్వామివారు గరుడ వాహనంపై విహరించగా మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, బాలాజీ దంపతులు, భక్తులు దర్శించుకున్నారు



భక్తులను కటాక్షిస్తున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

వాకాడులో..

వాకాడు : స్థానిక శ్రీ అలఘునాథస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భగా పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం, అన్నదానం, కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్ రెడ్డి, ఇతర నేతలు స్వామివారిని దర్శించుకున్నారు.

వెంకటగిరిరూరల్‌లో..

వెంకటగిరిరూరల్: మండలవ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానంచేశారు. ముద్దంపల్లి సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో, వల్లివేడు సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామంలోని షణ్ముగ సుబ్రమణ్యస్వామి ఆలయంలో, కనుమరాయి కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



రాపూరులోని మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామివారు గరుడ వాహనంపై నుంచి భక్తులను అనుగ్రహించారు. ఈఓ నవీన్‌కుమార్, ఆలయ చైర్మన్ కందలి ఆనంద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సైదాపురంలో..

సైదాపురం: కృష్ణారెడ్డిపల్లి సమీపంలో ఉన్న వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.



సైదాపురం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పెంచలకోన: శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పెంచలకోన: స్వామివారిని దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



గరుడ వాహనంపై శ్రీనివాసుడి గ్రామోత్సవం



ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



చిల్లకూరు: కలవకొండలో ఉత్తర ద్వారదర్శనంలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అర్హతే ప్రామాణికంగా పథకాలు



లబ్ధిదారుకు పింఛన్ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ప్రజలను మోసం చేసే నైజం చంద్రబాబుది
- వారిని ఆదుకునే స్వభావం మా సీఎం జగనన్నది
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : అర్హతే ప్రామాణికంగా తీసుకుని పింఛన్లు అందిస్తున్నామని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమంలో భాగంగా పింఛన్‌దారులకు, అలాగే కొత్తగా పింఛన్ మంజూరైన వారికి ఎమ్మెల్యే నగదును అందజేశారు. ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడానికి దారులు వెతికే వ్యక్తి చంద్రబాబు అయితే, పేదలకు ఎలా సాయం అందించాలని ఆలోచించే వ్యక్తి మన ముఖ్యమంత్రి జగనన్న అని చెప్పారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో కొత్తగా 196 మందికి పింఛన్ మంజూరైనట్లు చెప్పారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ జనవరి నెల నుంచి 38,129 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.9,32,90,000 ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పోలూరు పద్మ మిల్టన్, కమిషనర్ నరేంద్రకుమార్, వార్డు కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, కొండూరు జనార్దన్, సుశీల, పేర్నాటి లక్ష్మీదేవి, బందిల మహేశ్వర్ పాల్గొన్నారు.

ఓడూరుకు పిన్నెల్లి ఆత్మీయ పరామర్శ



ఓడూరు సుందరరామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లిరామకృష్ణరెడ్డి

నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి తండ్రి సీనియర్ నాయకులు ఓడూరు సుందరరామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలిసి మాచర్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాచర్ల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన నేరుగా గిరిధర్‌రెడ్డి ఇంటికి వెళ్లి సుందరరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఆయన సోదరుడు పిన్నెలి వెంకటరామిరెడ్డి, కర్నూల్ సెంట్రల్‌బ్యాంక్ మాజీ చైర్మన్ గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది బాలిరెడ్డి, మాచర్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఇంద్రసేనారెడ్డి, స్థానిక నాయకులు ఓడూరు ముద్దుకృష్ణారెడ్డి, జలంధర్‌రెడ్డి, బైనా శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



వాటంబేడు ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

తడ: మండలంలోని అక్కంపేట ఆదర్శ పాఠశాల, వాటంబేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు గతేడాది డిసెంబర్ 28 నుంచి 31 వరకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మోడల్ స్కూల్‌కి చెందిన సాయిచరణ్ జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో 200, 100 మీటర్ల పరుగు పందెంతోపాటు డిస్కస్ త్రో విభాగంలో ప్రతిభ చూపగా, పదో తరగతి విద్యార్థి డానియల్ డిస్కస్ త్రో విభాగంలో ప్రతిభ కనబరిచాడు. అదేవిధంగా వాటంబేడు హైస్కూల్ విద్యార్థులు ఖోఖోలో సురేఖ, సంజయ్, వాలీబాల్ పోటీల్లో సురేఖ, అరవింద్ విజేతలుగా నిలిచారు. అలాగే త్రోబాల్ విభాగంలో తిరుపతి, కబడ్డీలో యశ్వంత్, 100, 200 మీటర్ల పరుగు పందెంలో సురేఖ విజయం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సౌజన్య, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, వాటంబేడు హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సైదాపురంలో..

సైదాపురం: రాష్ట్రస్థాయిలో జరిగే అండర్–14, 17 విభాగాల్లో టెన్నికాయిట్ విభాగంలో కలిచేడు మైకామైన్ ఉన్నత పాఠశాలకు చెందిన మహి, శ్రీనివాసతేజ, అలాగే రగ్బీ క్రీడలో షేక్ షాహిదా, స్వాతి, శివలాస్య, తేజశ్రీ, శివ, ప్రసాద్, నితీష్ ఎంపికై నట్లు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పీడీ హరిప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలల్లో మాట్లాడుతూ నెల్లూరులో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను చూపినట్లు ఆయన చెప్పారు.



సైదాపురం: విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

గూడూరులో..

గూడూరు: నెల్లూరులో జరిగిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో స్థానిక రెండో పట్టణంలోని స్కూల్‌లో విద్యార్థులు దాసరిరాజు దీప్తి ఎంపికైనట్లు వీఎస్ఆర్ స్కూల్ డైరెక్టర్ బాలకృష్ణరాజు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ఆనం పర్యటన

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పాల్గొననున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన వెలువడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు

కోట: ఐసీడీఎస్ కోట ప్రాజెక్ట్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ సీడీపీఓ జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

నాయుడుపేట: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సైదాపురం: మండల కేంద్రంలోని సైదాపురం పీహెచ్‌సీలో మంగళవారం కొత్తగా మంజూరైన పింఛన్లను వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అందజేయనున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'ముమ్మర ప్రచారం చేపట్టనున్నాం'



పేర్నాటిని కలిసిన గూడూరు నాయకులు

గూడూరు: త్వరలో పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేసే దిశగా ముమ్మర ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో గూడూరు మండల వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, మూలి కిషోర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసులు పేర్నాటిని కలిసి అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికే స్పందన

చిల్లకూరు: మండలంలో నెలకొన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే ప్రత్యేక స్పందన కార్యక్రమం చేపట్టినట్లు గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. చిల్లకూరు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, డీటీ శ్రీనివాసులు, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, ప్రత్యేక అధికారి చైతన్యకుమార్, ఎస్‌ఐ గోపాల్, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరినీ ఉపేక్షించం

నాయుడుపేటటౌన్: గంజాయి విక్రయాలు, సింగిల్ నంబర్లు, జూదం తదితర అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించమని నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు తెలిపారు. పట్టణంలోని మునిరత్నం నగర్‌లో సోమవారం ఆయన కాలనీ వాసులను ఒకచోటకు చేర్చి మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు.

మహిళలకు చీరల పంపిణీ

గూడూరు: ప్రగతి సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సంస్థ కార్యాలయంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ హల్‌చల్

సూళ్లూరుపేట : శ్రీహరికోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటకానితిప్ప గ్రామానికి చెందిన కొందరు యువకులు గంజాయి మత్తుకు బానిసలుగా మారి అరాచకాలు సృష్టిస్తున్నారు. గ్రామస్తులను వేధించడమే కాకుండా, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మంచిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి అనే వ్యక్తి సైకిల్‌పై వెళుతుండగా గంజాయి బ్యాచ్ బైక్‌తో ఢీకొట్టింది. దీంతో సుబ్రమణ్యంరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోకిరీల ఆగడాలపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శ్రీహరికోట పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామానికి వచ్చిన కానిస్టేబుల్ సుబ్రమణ్యంపై గంజాయి బ్యాచ్ కత్తితో దాడికి యత్నించింది. పక్కనే ఉన్న మోటార్‌బైక్‌ను సైతం ధ్వంసం చేసింది. పోలీసు కేసులకు భయపడే ప్రసక్తే లేదని, తమకు అడ్డువస్తే నరికి చంపుతామని హెచ్చరించి పరారైంది. గంజాయి బ్యాచ్ చేష్టలు మితిమీరిపోతుండడంతో మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి చొరబడి దోచుకుంటున్నారని, ప్రశ్నించినవారిపై దాడి చేస్తున్నారని వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

'అమ్మా నేను బతికే ఉన్నాను'



గోడు వెళ్లబోసుకుంటున్న గిరిజన వృద్ధురాలు మానికల చెంచమ్మ

చిల్లకూరు: చిల్లకూరులో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఓ వృద్ధురాలు తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందించి 'అమ్మా నేను బతికే ఉన్నాను' అని చెప్పడంతో నివ్వెరపోయారు. మండలంలోని అన్నంబాక గ్రామానికి చెందిన మానికల చెంచమ్మ అనే గిరిజన మహిళ భర్త సుబ్బయ్య నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఆయన మృతిని నమోదు చేయాల్సిన అధికారులు భార్య, భర్త ఇద్దరూ మృతి చెందినట్లు నమోదు చేశారు. దీంతో ఆమె ప్రత్యేక స్పందనలో తన గోడు చెప్పుకుంది. తాను చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు కావడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా తనకు అందడం లేదని, పరాయి పంచన జీవనం చేయాల్సి వస్తోందని తహసీల్దార్ ఎదుట సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తహసీల్దార్ స్పందించి ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పొదుపు సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

దొరవారిసత్రం: అక్కరపాకం గ్రామ పరిధిలోని శ్యామ్ పొదుపు సంఘం మహిళలకు చెందిన రూ.4.65 లక్షలు సొమ్ము స్వాహాపై సోమవారం దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. బాధితులు కథనం మేరకు.. రెండేళ్ల కిందట దొరవారిసత్రం కెనరా బ్యాంకు ద్వారా రూ.7 లక్షలు రుణాన్ని గ్రూపు సభ్యులు తీసుకున్నారు. తీసుకున్న రుణం కొంతకాలం సక్రమగానే చెల్లిస్తూ వచ్చారు. కానీ శ్యామ్ పొదుపు సంఘం గ్రూపు లీడర్ అమ్ములు సభ్యుల నుంచి కట్టడానికి నగదు తీసుకుని, బ్యాంకులో చెల్లించకుండా తప్పుడు రసీదులు చూపుతూ పొదుపు సభ్యులను మభ్యపెట్టి రూ.4.65 లక్షలు స్వాహా చేసింది. గ్రూపు సభ్యులు రుణం కోసం బ్యాంకుకు వెళ్లినప్పుడు రుణానికి చెందిన నగదు చెల్లించకనే లీడర్ స్వాహా చేసినట్లు బయట పడిందని సంఘం మహిళలు పోలీసులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తిరుమలరావు విచారిస్తున్నారు.